క్లుప్తంగా

ఈశ్వరీమాత ఆలయం సందర్శన



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఈశ్వరీ మాత, వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాలను బనగానపల్లి శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామివారి మఠం ఎనిమిదోతరం అనువంశిక వారసులు వీరభద్రస్వామి దంపతులు శనివారం సందర్శించారు. విశ్వ బ్రాహ్మణ, స్వర్ణకార సంఘం వారు స్వామివారికి పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. బంగారు కొట్ల సెంటర్ పాదయాత్ర నిర్వహిస్తూ దేవాలయానికి చేరుకున్న వీరభద్ర స్వామి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. పూజారి సోమోజు రామకృష్ణమాచార్యులు, విశ్వబ్రాహ్మణసంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారంపై సమీక్ష




జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలపై ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) శనివారం స్థానిక విద్యుత్‌శాఖ ఏడీఈ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొని పట్టణంలోని లోఓల్టేజ్ సమస్యను సమావేశం దృష్టికి తెచ్చారు. ఎన్నో ఏళ్ల నుంచి తుప్పుపట్టి ఉన్న ఇనుప స్తంభాలను మార్చాలను కోరారు. ఓవర్ లోడుతో పనిచేస్తున్న ట్రాన్స్‌ఫారాలు తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ పట్టణంలో విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఏఈఈ ఎం.వసంతరావు, ఏడీఈ శ్రీనివాసరావు, సెక్షన్ ఏఈలు, సబ్ ఇంజనీర్లు, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కూటమి నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిరండి



వీరులపాడు: మండలంలోని కొణతాలపల్లిలో ఆదివారం నిర్వహించనున్న జ్యోతీరావ్ పూలే, బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాల ఆవిష్కరణకు అందరూ హాజరుకావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కోట డానియల్ కోరారు. విగ్రహావిష్కరణ నేపథ్యంలో కొణతాలపల్లిలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా పోరాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు ప్రతిఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. విగ్రహావిష్కరణకు మంద కృష్ణమాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మంద పిచ్చయ్య మాదిగ, ఆలూరు నాగమల్లేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిట



తిరుమలగిరి(జగ్గయ్యపేట):గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఏకాదశి కావడంతో పలు ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో స్వామి వారి దర్శనానికి తరలివచ్చారు. ఆలయం వద్ద శాంతి కల్యాణంలో పలువురు భక్తులు పాల్గొని పూజలు చేశారు. పలువురు దాతలు నిత్యాన్నదాన పథకానికి విరాళమందించారు. నిత్యాన్నదానం విరాళాల ద్వారా రూ.65,132, లడ్డూ ప్రసాదాల ద్వారా రూ. 93,230, దర్శనం టికెట్ల విక్రయం ద్వారా రూ. 57,670, తలనీలాలు టికెట్ల ద్వారా రూ.18,500 ఆదాయం వచ్చిందని ఈవో వర ప్రసాద్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని దంపతులకు గాయాలు

ట్రాక్టర్లను అడ్డుకున్న లంక గ్రామస్తులు

జూపూడి(ఇబ్రహీంపట్నం): జూపూడి సమీపంలో పెదలంక గ్రామం నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ ఢీకొన్ని భార్యాభర్తలకు గాయాలైన ఘటన శనివారం జరిగింది. ఇరుకుగా ఉన్న రోడ్డులో రెండు ట్రాక్టర్లు ఎదురైన క్రమంలో బైకుపై వెళుతున్న భార్యాభర్తలు దాసరి శివశంకర్, నాగలక్ష్మిలను ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్య కాళ్లకు గాయాలు కాగా, భర్తకు కూడా స్వల్ప గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పెదలంక గ్రామస్తులు ఘటనా స్థలానికి వచ్చి ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఇసుక రవాణాతో మా ప్రాణాలు పోయేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం పోలీస్‌స్టేషన్‌కు చేరడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ట్రాక్టర్ల రాకపోకలను నిలుపుదల చేశారు.



తువ్వకాలువకు అనిగండ్లపాడు వద్ద పడిన పెద్ద గండి

గండ్లు పూడిస్తేనే రబీసాగు

- వరదలకు పడిన గండ్లు..
- మూడునెలలుగా చేపట్టని గండ్ల పూడ్చివేత పనులు
- రబీసాగుకు నీరందడంపై రైతుల్లో అనుమానం
- గండ్లు పూడ్చించాలని రైతుల డిమాండ్

పెనుగంచిప్రోలు: తుఫాన్ ప్రభావంతో ఈ ఏడాది సెప్టెంబర్ నెల మొదటివారంలో కురిసిన భారీ వర్షాలకు మునేరు పక్కనున్న తువ్వకాలువకు పడిన గండ్లను పూడ్చివేత పనులు నేటివరకు చేపట్టలేదు. ఓవైపు ఖరీఫ్ సాగు ముగింపు దశకు చేరగా, మరోవైపు రబీసాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. అయితే తవ్వకాలువకు పడిన గండ్లను ఇప్పటివరకు పూడ్చకపోవడంతో రబీ సాగు పంటలకు నీరు అందే పరిస్థితులు లేవని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. రబీ సీజన్‌లో డిసెంబర్, జనవరి నెలల్లో జగ్గయ్యపేట నియోజకవర్గంలో సుమారుగా 2,500 హెక్టార్లలో వరి, 500 హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో మొక్కజొన్న సాగయ్యే అవకాశం ఉంది.



అనిగండ్లపాడు వద్ద ఇప్పటికీ తటాకాన్ని తలపిస్తున్న వరి పొలం

తువ్వకాలువకు 40 చోట్ల గండ్లు..

మునేరు పక్కన ఉన్న తువ్వకాలువకు 40చోట్ల గండ్లు పడ్డాయి. వత్సవాయి మండలం ఆళ్లూరుపాడు, వేములనర్వ వద్ద నాలుగు పెద్దగండ్లు, పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు వద్ద ఒక పెద్ద గండి పడింది. దీంతో వత్సవాయి మండలం పోలంపల్లి నుంచి ప్రారంభమయ్యే మునేరు ప్రాజెక్టు పరిధిలోని తువ్వకాలువలో సాగునీరు ప్రవహించక ఆయకట్టు పరిధిలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. మునేరు ప్రాజెక్టు కింద తువ్వకాలువ(పెనుగంచిప్రోలు) బ్రాంచ్ కింద సుమారు 3వేల ఎకరాల వ్యవసాయభూమికి సాగు నీరు అందుతోంది. వత్సవాయి మండలం ఆళ్లూరుపాడు, వేమవరం, పెనుగంచిప్రోలు మండలంలోని ముచ్చింతాల, పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు వరకు తువ్వకాలువ విస్తరించి ఉంది. ముఖ్యంగా వేమవరం, ఆళ్లూరుపాడు వద్ద ఈ తువ్వకాలువకు పెద్ద గండ్లు పడ్డాయి.

తటాకాలను తలపిస్తున్న గండ్లు..

ఆయకట్టు పరిధిలో ఖరీఫ్‌లో సైతం సాగు చేయని భూములు కూడా ఉన్నాయి. వరద ఉధృతికి పొలాలు మొత్తం గుంతలు పడి తటాకాలను తలపిస్తున్నాయి. ఈ గండ్లను పూడ్చకపోతే రబీసాగు చేపట్టడం కష్టమని రైతులు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తవ్వకాలువకు పడిన గండ్లను పూడ్చి రబీసాగుకు అవరోధాలు లేకుండా చూడాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు

అంచనాలకే పరిమితమైన పనులు..

తవ్వకాలువకు పడిన గండ్లు పూడ్చివేతపై 'సాక్షి' ప్రాజెక్టు అధికారులను వివరణ కోరగా తువ్వకాలువకు పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు గ్రామాల మధ్య పడిన భారీగండ్ల మరమ్మతులకు రూ.1.60 కోట్లతో అంచనాలు తయారు చేసినట్లు తెలిపారు. ఈమేరకు ప్రభుత్వానికి నివేదిక అందించామని, నిధులు రాగానే గండ్లు పూడ్చివేత పనులు ప్రారంభిస్తామని అధికారులు వివరించారు.

గండ్లు పూడ్చకపోతే సాగు కష్టమే..

తువ్వకాలువకు గండ్లు పడటంలో ఈఖరీఫ్ సీజన్‌లో రైతులు విలువైన పంట కోల్పోయారు. వరద ఉధృతికి పొలాల్లో ఇసుక మేట వేయడం, భూములు కోతకు గురి కావడం, మోటార్లు, బోర్లు పాడవ్వడంతో ఈప్రాంత రైతులకు తీరనినష్టం వాటిల్లింది. వరదలకు గండ్లు పడి మూడునెలలు అవుతున్నప్పటికీ వాటి పూడ్చివేత పనులను మాత్రం పాలకులు, అధికారులు నేటివరకు చేపట్టలేదు. గండ్లు పూడ్చకపోతే రబీలో కూడా రైతులు సాగుచేసే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. తవ్వకాలువ గండ్లు పూడ్చివేత పనులు పూర్తిగాకపోతే ఖరీఫ్ నష్టాలను రబీలోనైనా అధిగమించేందుకు సన్నద్ధమవుతున్న రైతుల ఆశలకు 'గండ్లు' పడేలా ఉన్నాయి.



తువ్వకాలువకు ఆళ్లూరుపాడు వద్ద పడిన గండి

రబీ సాగుకు నీరందించాలి..



అనిగండ్లపాడు పరిధిలో తువ్వకాలువకు పెద్దఎత్తున గండ్లు పడ్డాయి. ఆయా గండ్లను తక్షణమే పూడ్చి రైతులను ఆదుకోవాలి. ఖరీఫ్‌లో వరదల కారణంగా పంట కోల్పోవడంతోపాటు భూములు కోతకు గురై రైతులు ఇబ్బందిపడ్డారు. గండ్లు పూడ్చితే రబీలో అయినా రైతులు పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుంది.

పిడికిటి కోటేశ్వరరావు, రైతు, అనిగండ్లపాడు

గండ్లు పడి చుక్కనీరు రాలేదు..



మునేరు తవ్వకాలువకు మునుపెన్నడూ లేనివిధంగా కొన్నిచోట్ల వంద మీటర్ల మేర కూడా గండ్లు పడ్డాయి. గండ్లు పడటంతో ఒక్క చుక్క కూడా రావడం లేదు. మరోవైపు రబీ సీజన్ కూడా ముంచుకొస్తోంది. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే ఆయా గండ్లు పూడ్చివేత పనులు చేపట్టాలి.

చుంచు భూషణం, రైతు, పెనుగంచిప్రోలు

వ్యాపార అభివృద్ధికి పూర్తి సహకారం

సీజీఎం రవీంద్రబాబు



జగ్గయ్యపేట: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వ్యాపారాభివృద్ధికి యూనియన్ బ్యాంక్ పూర్తి సహకారం అందిస్తుందని ఆ బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) రవీంద్రబాబు తెలిపారు. పట్టణ సమీపంలోని షేర్‌మహ్మద్‌పేట అడ్డరోడ్డులోని వెంకట సాయి ఫుడ్ ప్లాజా కల్యాణ మండపంలో శనివారం జగ్గయ్యపేట యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఎంఎస్ఎంఈ నిర్వాహకులకు బంగారు ఆభరణాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఆటోనగర్‌లో ఇటీవల క్లస్టర్ ఏర్పాటు చేసినందున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. వ్యాపారులు వారి వ్యాపారాభివృద్ధికి కావలసిన రుణాలను బ్యాంకుల నుంచి తీసుకుని ప్రగతిపథంలో రాణించాలని సూచించారు. ఈ మేరకు తమబ్యాంకు వ్యాపారులకు పూర్తిస్థాయి సహాయసహకారాలను అందిస్తాందని వివరించారు. కార్యక్రమంలో యూనియన్‌బ్యాంకు జీఎం సాంబయ్, ఏజీఎం హరిరామ్, ప్రతినిధులు మూర్తి, స్వరూప్, జగ్గయ్యపేట గోల్డ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీరామ్ సుబ్బారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

12న గండేపల్లిలో సెమీక్రిస్మస్ వేడుకలు

కంచికచర్ల : ఓఫీర్ మినిస్ట్రీస్ ఇంటర్నేషనల్ దక్షిణ కోస్తాంధ్రశాఖ రాష్ట్రీయ క్రైస్తవ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 12వతేదీ రాత్రి 7గంటలకు గండేపల్లిలో సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ డి. నాయనబాబు శనివారం తెలిపారు. కార్యక్రమానికి ఆర్‌కేపీ సౌత్ కోస్టల్ ఏరియా అధికార ప్రతినిధి కోటా సత్యానందం సభాధ్యక్షులుగా వ్యవహరిస్తారన్నారు. ముఖ్యప్రసంగీకులుగా డాక్టర్ అద్దంకి రంజిత్ ఓఫీర్, పాస్టర్ ఎం.దయాసాగర్, కె.సత్యానందం, ఎ.పాల్‌బాబు ప్రసంగిస్తారని వివరించారు.

దుర్గంధం వెదజల్లుతున్న మధిర రోడ్డు



నందిగామ- మధిర రోడ్డు పక్కన పడేసిన చెత్తాచెదారం

- రోడ్డు పక్కనే చెత్తాచెదారం
- ఇబ్బందుల్లో వాహనచోదకులు
- పట్టించుకోని అధికారులు

నందిగామటౌన్: పట్టణంలోని మధిర రోడ్డులో మున్నేటి సమీపంలో రోడ్డు పక్కనే చెత్తాచెదారాన్ని పడేస్తుండటంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనచోదకులు, ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. ఈ రహదారి ఆంధ్రా, తెలంగాణలను కలిపే ప్రధాన రహదారిగా ఉండటంతో నిత్యం వందల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. అంతే కాకుండా సమీపంలో పల్లగిరి గట్టుపై పలు ఆలయాలు ఉండటంతో భక్తులు రద్దీ కూడా అధికంగా ఉంటోంది. ఈ క్రమంలో పట్టణంలోని శుభ, అశుభ కార్యక్రమాలకు వినియోగించిన వ్యర్థాలు, ప్లాస్టిక్, ఖాళీ కొబ్బరి బొండాలను ఇక్కడే పడేస్తున్నారు. కొందరు మాంసాహార దుకాణాల నిర్వాహకులు ఆయా వ్యర్థాలను తెచ్చి ఈ రోడ్డులో పడేస్తున్నారు. దీంతో ఈరోడ్డులో దుర్గంధం వెదజల్లుతుండటంతో ప్రజలు అవస్థలుపడుతున్నారు.

ముక్కుపుటాలు అదరాల్సిందే..

ఈ రహదారిలోనే మండలంలోని సుమారు 15 గ్రామాలకు చెందిన ప్రజలు, ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది, పాఠశాల విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. చెత్తాచెదారం, వ్యర్థాలు రోజుల తరబడి ఇక్కడ నిల్వ ఉండటంతో భరించలేని దుర్గంధం వెదజల్లుతోందని ప్రజలు వాపోతున్నారు. ఈ మార్గంలో వెళ్లాలంటే ముక్కు పుటాలు అదురుతున్నాయని చెబుతున్నారు. అపరిశుభ్ర వాతావరణం కారణంగా దోమలు కూడా వ్యాప్తి చెందుతున్నాయని దోమల బెడదతో అనారోగ్యం బారిన పడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చెత్తను తొలగించడంతో పాటు రోడ్డు పక్కన చెత్త పడేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మొదలైన వరి కోతలు



పెనుగంచిప్రోలు మండలంలో యంత్రం సాయంతో చేపట్టిన వరికోతలు

పెనుగంచిప్రోలు: ఉమ్మడి కృష్ణాజిల్లాలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. అయితే వాతావరణంలో మార్పులు, మబ్బులు చేస్తుండటంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఈ తరుణంలో కోతకు వచ్చిన వరి పంటను కోయాలా? వద్దా అనే సందిగ్ధంలో అన్నదాతలు ఉన్నారు. వర్ష సూచనలకు భయపడి రైతులు కోతకు వచ్చిన వరి పంటను కోత కోయించటాన్ని రైతులు రోజుల తరబడి వాయిదా వేసుకుంటున్నారు. కొందరు ధైర్యంతో యంత్రాల సాయంతో కోయిస్తున్నారు. అసలే ఈ ఏడాది సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వర్షాలు, వరదలకు సాగు చేసిన పంట కొట్టుకుపోవటంతో పాటు సాగునీరు అందక రైతులు కొంత నష్టపోయారు. మిగిలిన పంటనైనా కాపాడుకుందామని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. వర్షాలు పడి అదును దాటితే గింజలు రాలిపోతాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట మండలాల్లో ఈ సీజన్‌లో సుమారుగా 5,700 హెక్టార్లలో వేల ఎకరాల్లో వరి చెరువులు, బావులు, మునేరు ఎత్తిపోతల పథకాల కింద సాగు చేశారు. ఈ ఏడాది వరదలకు 1,777 హెక్టార్లలో పంట దెబ్బతింది. ప్రస్తుతం పంట మొత్తం కోత దశకు చేరుకుంది. వాతావరణం అనుకూలిస్తే రైతులు కోతలు మరింత ముమ్మరం చేస్తారు.

వరి కోత యంత్రాల కొరత..

వాతావరణం మబ్బులు పట్టి ఉన్నప్పటికీ కోత కోసందుకు చాలామంది రైతులు సిద్ధమయ్యారు. వరికోత యంత్రాలు అందుబాటులో లేకపోవటంతో ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఒక పక్క పంట అదును దాటితే ఎండిపోయి గింజ రాలుతుందని, మరో పక్క మారుతున్న వాతావరణం కలవరపెడుతోందని రైతులు వాపోతున్నారు. యంత్రాల కొరతతో డిమాండ్ పెరగటంతో వరికోత యంత్రాల యజమానులు అధికంగా వసూలు చేస్తున్నారని రైతులు అంటున్నారు.

18న భవానీ పేరంటాళ్లమ్మ తిరునాళ్లు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలోని శ్రీచంద్రశేఖర సమేత భవానీ పేరంటాలు అమ్మవారి ఉత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయని గ్రామపెద్ద రామిశెట్టి చంటి శనివారం తెలిపారు. ఈనెల 18న భవానమ్మ, అంకమ్మ అమ్మవార్ల తిరునాళ్లు వైభవంగా ప్రారంభమవుతుందన్నారు. 16న దామెర్ల వీధి నందు అమ్మవారి పుట్టినింటిలో కుమ్మరి గరిటి వద్ద బలి, అంకురార్పణ జరుగుతుందని చెప్పారు. 17న ఉదయం అమ్మవారికి బోనాలు, సారె సమర్పిస్తారన్నారు. సాయంత్రం అంకమ్మ వారికి పంబల వారిచే పట్నపు సేవ ఉంటుందని చెప్పారు. 18న సాయంత్రం అమ్మవారికి సిరిమానోత్సవం నిర్వహిస్తారన్నారు. అనంతరం పవళింపు సేవలు జరుగుతాయని వివరించారు. తిరునాళ్లలో వేలాదిగా భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు పలువురు కళాకారులు నృత్య నీరాజనాలను అర్పించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన శ్రీ కూచిపూడి నృత్య అకాడమికి చెందిన కొండవీటి శ్రీదేవి శిష్యబృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. కోరపాటి అన్విత శిష్యబృందం భరత నాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై నిర్వహించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. నృత్య ప్రదర్శన అనంతరం కళాకారులను ఆలయ డీఈవో రత్నరాజు అభినందించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

అనుమంచిపల్లి ఇసుక రీచ్‌లో అక్రమాలు

ఇంటూరి చిన్నా



విలేకరులతో మాట్లాడుతున్న ఇంటూరి రాజగోపాల్(చిన్నా)

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట అర్బన్): జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లిలోని ఇసుక డంపింగ్ యార్డులో అనేక అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్(చిన్నా) ఆరోపించారు. ఆయన శనివారం అనుమంచిపల్లి ఇసుక డంపింగ్ యార్డును సందర్శించారు. అనంతరం రాజగోపాల్ విలేకరులతో మాట్లాడుతూ ఈ ఇసుక యార్డులో లారీ ఇసుక కోసం ప్రభుత్వానికి రూ.4040 చలానా చెల్లించి, సుమారు 30 నుంచి 40టన్నుల మేర ఇసుకను లారీల్లో తరలిస్తున్నారన్నారు. ఈ విషయంపై ఇక్కడి అధికారులను ప్రశ్నిస్తే మాకు వేబ్రిడ్జి లేనందున బక్కెట్ల లెక్కన లారీల్లో ఇసుకను నింపుతున్నామని చెబుతున్నారన్నారు. ఇలా రోజుకు 70 నుంచి 100 లారీల ఇసుక ఇక్కడి నుంచి తరలివెళ్తుండగా, ఒక్కో లారీకి 10టన్నుల ఇసుక అదనంగా వెళ్లినా సరాసరిన రోజుకు 700 టన్నులకుపైగా ఇసుక అక్రమంగా తరలివెళ్తోందన్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు రూ.7లక్షల మేర నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సొమ్మంతా అక్రమార్కుల జేబుల్లోకి వెళ్తోందని వివరించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి లారీలు ఇక్కడికి ఇసుక కోసం రావడం గమనించామని, అక్కడ ఇసుక రీచ్‌లు లేవా? ప్రశ్నించారు. ఇక్కడ బడా నాయకులు ఇసుక వ్యాపారం చేస్తున్నందునే స్థానిక అధికారులు వాళ్లకు సహకరిస్తున్నారని ఆరోపించారు. స్థానికులకు ఈ యార్డులో ఇసుక ఇవ్వకుండా శనగపాడు, కన్నెవీడు యార్డుల వద్దకు వెళ్లాలని అధికారులే సూచిస్తుండటం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. దూరప్రాంతాల నుంచి ఇసుక కోసం లారీలు ఇక్కడికి రావడంలో ఆంతర్యమేమిటో అధికారులే చెప్పాలన్నారు. ఈనెల 8వతేదీన ఆన్‌లైన్ స్లిప్‌లు సరిగాలేవనే కారణంతో చిట్యాల గ్రామంలో రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న అధికారులు, అనుమంచిపల్లి యార్డులో వేబ్రిడ్జి లేకుండా లారీలకు ఇసుకను ఎలా నింపుతారని ఇంటూరి రాజగోపాల్ ప్రశ్నించారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ తరలింపును అడ్డుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎంవీఆర్ విద్యార్థినికి స్వర్ణపతకాలు



కరాటే పోటీల్లో ప్రతిభచూపి స్వర్ణపతకాలు అందుకుంటున్న ఎంవీఆర్ విద్యార్థిని హరిచందన

పరిటాల(కంచికచర్ల): తమ ఇంజినీరింగ్ కళాశాలలో నాణ్యమైన విద్యనందించడంతోపాటు విద్యార్థులకు ఆయా క్రీడా విభాగాల్లో మంచి తర్ఫీదు ఇస్తున్నామని పరిటాల ఎంవీఆర్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ ఎం.శ్రీనివాసబాబు పేర్కొన్నారు. నరసాపురంలోని స్వర్ణధార ఇంజినీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీల్లో పరిటాల ఎంవీఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని హరిచందన రెండు స్వర్ణపతకాలను సాధించింది. ఎంవీఆర్ కళాశాలలో శనివారం హరిచందనకు అభినందనసభ నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసబాబు మాట్లాడుతూ ఈ ఏడాది డిసెంబర్ నెలలో జరుగనున్న సౌత్‌జోన్ యూనివర్సిటీ పోటీలకు హరిచందన అర్హత సాధించినట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యు.ఏడుకొండలు, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.రామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ ఐ.గోపాలరావు, ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీలకు తరలిన క్రీడాకారులు



జగ్గయ్యపేట అర్బన్: మాస్టర్స్ ఆక్వాటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాజమండ్రిలో ఆదివారం నుంచి జరుగున్న ఆంధ్రప్రదేశ్ స్టేట్ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు జగ్గయ్యపేటకు చెందిన డ్రీమర్స్ స్విమ్మర్స్ అసోసియేషన్ స్విమ్మర్లు శనివారం తరలివెళ్లారు. 7వ స్టేట్ ఛాంపియన్‌షిప్ 2024 పోటీల్లో జగ్గయ్యపేట పట్టణం నుంచి స్విమ్మర్లలో 12 మంది మహిళలు, 12 మంది పురుషులు కలిపి 24మంది సిమ్మర్లు పాల్గొననున్నారు. జట్టుకు కోచ్ దంపతులు పొట్టాబత్తిన పాండురంగారావు, లక్ష్మి, టీమ్ మేనేజర్ అన్నంనీడి కళ్యాణ్ నాయకత్వం వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మందడపు శ్రీనివాసరావు, కలాలి నరేష్ తెలిపారు.